కథాకేళి

# అడవిలో వెన్నెల

# మల్లాది వెంకటకృష్ణమూర్తి



రామచంద్రమూర్తి సినిమాల్లో వేషాలు వేయడానికి కారణం అతనో చిరంజీవి అయిపోయి, మేడలు మిద్దెలు కట్టికార్లలో తిరగాలనుకోవడం కాదు. చిన్నప్పటి నించి నాటకాల్లో వేయడం, నటన హాబీ అవడం వల్ల మాత్రమే. అతను హైదరాబాద్‌లో ఓ మంచి ఉద్యోగంలో వున్నాడు. భార్య కూడా ఉద్యోగినే. అతనికి సంపాదనకేం తక్కువ లేదు.

హైదరాబాద్‌లో సినిమా షూటింగ్స్ పెట్టుకునే దర్శక, నిర్మాతలని కలిసి చిన్న చిన్న వేషాలు వేయడం అతనికి హాబీ. చిన్న వేషాలకి పారితోషికా లిచ్చే నిర్మాతలు తక్కువ కాబట్టి అతను తన స్వంత ఖర్చుతోనే షూటింగ్ స్పాట్‌కి వెళ్ళొస్తుంటాడు. కొందరికి పేకాటలా, మరి కొందరికి గుర్రపు పందాల్లా అది అతనికి హాబీ మాత్రమే.

చక్కటి సినిమాలు, ఎలాంటి బూతు లేకుండా తీసే దర్శకుడిగా పేరు తెచ్చుకున్న ఓ దర్శకుడ్ని రామచంద్రమూర్తి తరచు కలుస్తుంటాడు. కొత్త నటీనటులని ప్రోత్సహించేవారిగా పేరున్న ఆ దర్శకుడు తీసిన కొన్ని చిత్రాలలో చిన్న పాత్రలు పోషిస్తుంటాడు.

మిగతా దర్శక, నిర్మాతల విషయంలో రామచంద్రమూర్తికి ఎలాంటి పేచీ లేదు కాని ఈ దర్శకుడి వల్ల అనేకసార్లు మానసిక వేదన అనుభవించాడు.

మొదటిసారి వేషం కోసం వెళ్ళినప్పుడు ఆ దర్శకుడి హోటల్ గదిలో తొంభై నాలుగు మంది మిత్రులున్నారు. వాళ్ళందరి ముందు అడిగాడు—

"మీకు బ్రేక్ డాన్స్ వచ్చా మూర్తి గారు?"

రాదంటే బావుండదని "కావాలంటే నేర్చుకుంటాను" చెప్పాడు రామచంద్రమూర్తి వినయంగా.

"అపలెంతదాకా వచ్చో చేసి చూపించండి" అని డైరెక్టర్ గట్టిగా చెప్పడంతో తోచిన రీతిలో చేసి చూపించాడు.

"అదిరిపోయేలా చేశారు. ఇక చిరంజీవి, నాగార్జున ఇళ్ళకెళ్ళాల్సిందే" మెచ్చుకోలుగా చెప్పాడా దర్శకుడు.

మర్నాడు తీసే బ్రేక్ డాన్స్ సాంగ్‌లో అతన్ని తీసుకున్నట్లుగా చెప్పాడు. మర్నాడు సెలవు పెట్టి రామచంద్రమూర్తి బ్రేక్ డాన్స్ తీసే హోటల్‌కి వెళితే దర్శకుడు అతన్ని చూసి "ఇవాళ కాదు, ఇంకోసారి చూద్దాం" అన్నాడు. రామచంద్రమూర్తి నిరుత్సాహంగా వెళ్తుంటే, అది గమనించి రాత్రి హోటల్ గదికి వచ్చి కలవమన్నాడు ఆ దర్శకుడు.

ఆ దర్శకుడి పిలుపు కోసం అరగంట రిసెప్షన్‌లో వేచివున్నాక పిలుపు వచ్చింది. మళ్ళీ తొంభై నాలుగు మంది మిత్రులతో కొలువు తీరి వున్న ఆ దర్శకుడు "సారీ మూర్తిగారు. ఇవాళ మిమ్మల్ని తీసుకోలేకపోయాము. రేపు సెలవు పెట్టగలరా?" అడిగాడు.

"అలాగే సర్" చెప్పాడు రామచంద్రమూర్తి వినయంగా.

"రేపు సీన్‌లో మీరు ఆడ వేషం వేయాలి. వేయగలరా అని డౌట్‌గా వుంది."

"వేస్తాను సర్. చాలాసార్లు నాటకాల్లో ఆడ వేషాలు వేశాను" చెప్పాడు రామచంద్రమూర్తి.

"జస్ట్ ఓసారి నటించి చూపించండి" రామచంద్రమూర్తికి ఓ డైలాగ్ కాగితం ఇచ్చి చెప్పాడు దర్శకుడు.

రామచంద్రమూర్తి ఆ డైలాగ్స్ చదువుకొని నటించాడు.

"మా ఆయన ఇంట్లో వుండరు రాత్రికి. నీవు వస్తే చేపల పులుసు, కోడి ఇగురు ఇంకా... ... ... ... ... ... (... బూతు పదం) అన్నీ ఇచ్చేస్తాను రావా మావ."

"సర్ ఈ పదం అసభ్యంగా వుంది" చెప్పాడు రామచంద్రమూర్తి షాక్ తిని.

"ఓ..సారీ. ప్రస్తుతానికి అలా అనండి. రేపు మారుస్తాను. జస్ట్, ఏక్షన్, వాచకం ఎలా వుందో చూడాలి. అంతే."

రామచంద్రమూర్తి ఆ బూతు పదానికి ప్రత్యామ్నాయంతో చెప్పాడా డైలాగ్. దర్శకుడికి తృప్తి కలగలేదు.

"మీలో ఆడతనం లేదు. పోనీ మగతనం వుందా?" అడిగాడు.

"అంటే?" అదిరిపడ్డాడు.

"అంటే ఓ అమ్మాయిని రేప్ చేయగలరా?" అని.

"మీరు ఎలా చెప్తే అలా నటిస్తాను సర్. మీ సినిమాలో కనబడితే చాలు" వినయంగా చెప్పాడు రామచంద్రమూర్తి.

"అయితే ఎవరిని రేప్ చేస్తారిప్పుడు? ఓసారి నేను చూడాలిగా?" అడిగాడు దర్శకుడు.

రామచంద్రమూర్తి మాట్లాడలేదు.

"ఆ కార్లోని అమ్మాయనుకొని రేప్ చేయాలి" చెప్పాడో మిత్రుడు.

"కార్లోనా సర్?"

"బాలు మహేందర్ తీసిన ఓ సినిమాలో కమల్‌హసన్, శ్రీదేవి రైల్లో వుండగా ఆమెని వెళ్ళద్దని కెమేరా ముందు నటించాడు, కాని శ్రీదేవి ముందు కాదు. ప్రేక్షకులకి శ్రీదేవి ముందే అనిపించేంత సహజంగా నటించాడు. నటుడికి కావలసింది భావోద్వేగం కాని తోటి నటుడు కాదు" చెప్పాడు తొంభై నలుగురు మంది మిత్రుల్లో ఒకడు.

రామచంద్రమూర్తి కాదనలేదు. అలాగే నటించి చూపించాడు.

మర్నాడు ఉదయం రేప్ సీన్‌లో లేదు. ఓ అమ్మాయిని వెల్లాయ్ అని పిలిచి చేతిని పట్టుకోవాలి. ఆ అమ్మాయి బదులుగా ఛెళ్ళున చెంప మీద కొట్టి 'సిసుడా' అని తిట్టాలి. ఆరు సార్లు రిహార్సల్స్‌లో చెంప వాచిపోయింది.

ఆ చిన్న వేషం వేశాడు రామచంద్రమూర్తి. ఆ సినిమా రిలీజ్ అయాక ఆ సీన్ లేదు. కథలో ఎక్కడా అతికే సీన్ కాదు అది. ఆ యూనిట్‌లోని ఓ బాయ్ రామచంద్రమూర్తిని పక్కకి పిలిచాడు ఇంకోసారి అతను ఆ దర్శకుడి దగ్గరకి వెళితే.

"మీరు చదువుకున్నవారు సర్. మంచి ఉద్యోగంలో వున్నారు. ఆయన దగ్గరకి ఎందుకు వెళ్తారు?" చెప్పాడు బాయ్ బాధగా.

"ఏం?" ఆశ్చర్యంగా అడిగాడు రామచంద్రమూర్తి.

"ఆ దర్శకుడు, వాళ్ళ మిత్రులకి రాత్రిళ్ళు మందుతోపాటు సేడిస్టిక్ వినోదం కావాలి. మీలాంటి ఔత్సాహిక నటీనటుల్ని పిలిపించి 'రేగింగ్' చేస్తారు. అది రేగింగ్ అని మీకు అనిపించదు. నిజంగా నటనే చేయిస్తున్నారనుకుంటారు. మీరు వెళ్ళాక 'ఈ బురిడి ఎప్పుడయినా అద్దంలో మొహం చూసుకున్నాడా?' అని నవ్వుకుంటారు. మీలాంటివాళ్ళని భోజనం కారియర్ తీసుకు వచ్చినప్పుడల్లా చూస్తుంటాను. నా కెంతో బాధేస్తుంది" చెప్పాడు ప్రొడక్షన్ బాయ్.

ఆ తర్వాత రామచంద్రమూర్తి మానవత్వం మరిచి తోటి కళాకారుల్ని బఫూన్‌గా చేసి రాక్షస వినోదాన్ని పొందే ఆ దర్శకుడి దగ్గరకి మళ్ళీ వెళ్ళలేదు. అతని మిత్రులు కనబడితే నమస్కారం కూడా చేయడిప్పుడు.



ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 19-1-90